## విలేకరులు కావలెను

హంస కలం వార్త తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9966555449



www.hamsakalam.com

PRGI: TGTEL/26/A3129

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి





సంపుటి : 1 సంచిక : 1 ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి శనివారం 9 మే 2026 పేజీలు :8 వెల: 2/-


## బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

హంసకలం వార్త, మే 08

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి పగ్గాలు చేపట్టనున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, - మిగతా2లో



## ప్రాణహిత పై ప్రధానికి వివరించండి

హంసకలం వార్త, మే 08

ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకట స్వామి, ఎమ్మెల్యేలు, అధికారులు పరిశీలించారు. నీటి లభ్యతపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. నాటు పడవలపై నదీ ప్రవాహాన్ని మంత్రులు పరిశీలించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ - మిగతా2లో



## దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి

### అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపనలు



హంసకలం వార్త, మే 08

దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్ ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజక వర్గం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. 430 పడకల ఆస్పత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణు గోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం - మిగతా2లో

## మూసీ తొలిదశ

### పనులకు 7,055 కోట్లు



హంసకలం వార్త, మే 08

మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టును మొత్తం 55 కిలోమీటర్ల మేర 5 దశల్లో అభివృద్ధి చేపట్టనున్నారు. ఫేజ్-1కు 7,055 కోట్ల రూపాయల వ్యయం అంచనా వేశారు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధుల కోసం సాంకేతిక, ఆర్థిక చర్చలు పూర్తి అయ్యాయి. ప్రజా భవన్‌లో మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టుపై కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును ప్రజల భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి పేరుతో - మిగతా2లో

## యువత మత్తుకు దూరంగా ఉండాలి

హంసకలం వార్త, మే 08

యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. యువత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. టాలెంట్ ఆధారంగా మాత్రమే ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన – ప్రగతి - మిగతా2లో



## కృష్ణానగర్ వరదకు పరిష్కారం చూపుతాం

హంసకలం వార్త, మే 08

రాజధానిలో వర్షాకాలం వచ్చిందంటే రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అసలే ట్రాఫిక్, ఉప్పొంగే డ్రైనేజీలు.. తెరుచుకుని ఉండే మ్యాన్ హోల్స్ వెరసి వాహనదారులకు నరకప్రాయంగా ఉంటుంది. ఇక కృష్ణానగర్ నగర్ గురించి ఎంత చెప్పినా - మిగతా2లో



## పోలీస్ అధికారి భార్య హత్య కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి

హంసకలం వార్త, మే 08

జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనుజా (55) హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాల పై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు - మిగతా2లో



## తెలంగాణకు కేంద్ర సహకారం పై చర్చకు సిద్ధం

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హంసకలం వార్త, మే 08

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి - మిగతా2లో



## రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతి భద్రతలు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

హంసకలం వార్త, మే 08

రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లనే, ప్రజల రక్షణ, భద్రత - మిగతా2లో



# దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఓవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం అభినందనీయమని తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవరదా చార్యులు కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగు తాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.కృష్ణ- వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యాహబ్‌గా మార్చుతున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# మూసీ తొలిదశ పనులకు 7,055 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి పేరుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజల ఆస్తులకు నష్టం లేకుండా ప్రాజెక్టును రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అలైన్‌మెంట్ మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తొలి 5 కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. నదిలోని చెత్తను తొలగించి, రివర్ బెడ్ ప్రొఫైలింగ్‌ను ప్రభుత్వం చేపట్టనుంది. వరద నియంత్రణకు రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించనున్నారు. మూసీ రెండు వైపులా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, నీటి నిల్వ కోసం బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణకు డీపీఆర్‌ను తయారీకి నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు వివరాలను నగరవ్యాప్తంగా ప్రచారం చేయాలని సబ్ కమిటీ ఆదేశించింది. బస్టాండ్లు, ప్రధాన రోడ్లు, థియేటర్లలో ప్రచార వీడియోలు ప్రదర్శించనున్నారు. 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించడం లక్ష్యంగా నిర్ణయించారు. డిసెంబర్ 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ ప్రాజెక్ట్ సాంకేతిక పర్యవేక్షణకు సహకారం తీసుకోనున్నారు. నిర్మాణాలపై ప్రభావం లేని 5.కి.మీ మేర పనులు ప్రారంభించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. నిర్మాణాల పై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని మంత్రులు సూచించారు. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మూసీపై రబ్బర్ డ్యామ్ నమూనాలను ఈ సందర్భంగా ఉపసంఘం పరిశీలించింది.

# ప్రాణహిత పై ప్రధానికి వివరించండి

-మొదటిపేజీ తరువాయి

ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, వికసిత్ భారత్ అని చెప్పుకునే కేంద్రం ఈ ప్రాజెక్టు విషయంలో పెద్ద మనసు చాటుకోవాలని కోరారు. బీజేపీ ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఒక్క యూనిట్ కరెంటు కూడా ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీటిని తరలించే ఈ బృహత్తర కార్యాన్ని పూర్తి చేస్తామని, ఈ విషయంలో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు మానుకుని సహకరించాలని మంత్రి జూపల్లి కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మూడు జిల్లాలకు సాగు నీరు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని అన్నారు. ముంపుకు గురయ్యే ప్రాంతాలకు నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పారు. ఎల్లుండి(మే 10) తెలంగాణకు వస్తున్న ప్రధాని మోదీ పెద్దమనసుతో ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పట్టాలెక్కిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సాగునీటి రంగంలో గ్రావిటీ ద్వారా నీటిని అందించే గొప్ప అవకాశాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాసిందని ఆయన విమర్శించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ, 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. డా. బీఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూమిపూజ చేశారు. రూ. 38,500 కోట్ల అంచనా వ్యయంతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. 106 కిలోమీటర్ల కాలువ పనులకు గానూ ఇప్పటికే 71.5 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తయ్యి, 46 కిలోమీటర్ల మేర పనులు కూడా జరిగాయి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కన పెట్టి, కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఆర్థిక భారం మోపిందని మండిపడ్డారు. గ్రావిటీ ద్వారా వెళ్లాల్సిన నీటిని పంపుల ద్వారా ఎత్తిపోయడం వల్ల అంచనా వ్యయం గణనీయంగా పెరిగిందని మంత్రి వివరించారు. దీనివల్ల రాష్ట్రంపై భారీగా ఆర్థిక భారం పడటమే కాకుండా, కరెంట్ బిల్లులు కూడా భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. నది తలాపునే ఉన్న సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల రైతులకు తీరని అన్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడంతో ప్రస్తుతం ఆ నీటిని వినియోగించుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పూర్తి చేయడానికి కృత నిశ్చయంతో ఉందని జూపల్లి తెలిపారు. 150 మీటర్ల బరాజ్ నిర్మాణానికి అంగీకరించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతాం. దీనివల్ల మహారాష్ట్రలోని శివిని గ్రామానికి ఎలాంటి ముంపు సమస్య ఉండదు. భూములు నష్టపోయిన వారికి పరిహారం ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నాం.

# యువత మత్తుకు దూరంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

శుక్రవారం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా కాళోజీ కళాక్షేత్రంలో మెగా జాబ్‌మేళా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్ సత్యశారదదేవి పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. సమాజంలో ఇప్పటి జనరేషన్‌లో చాలా మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. మనం తప్పు చేయనంతవరకూ ఎవరికీ భయపడొద్దని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. యువత ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య వ్యాఖ్యానించారు. నిత్యం మనలో మనం యుద్ధం చేసుకోవాలని అన్నారు. యువత ఉద్యోగాల ప్రయత్నాలను ఆపొద్దని చెప్పుకొచ్చారు. యువత కష్టపడి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. ఏఐ వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. నేటి పోటీని తట్టుకుని నిలబడాలని అన్నారు.

# రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు

-మొదటిపేజీ తరువాయి

శాంతి భద్రతల క్షీణత పై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అంతేకాకుండా, నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని ఆరోపించారు. 'పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని' స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్సీఆర్బీ నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న రేవంత్ రెడ్డి ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు.

## బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

-మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నేతలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. పాలనలో సమతుల్యత కోసం ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమిం చాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఒక డిప్యూటీ సీఎం పదవిని మహిళా నేత బహుశా అగ్నిమిత్ర పాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఉత్తర బెంగాల్, గిరిజన ప్రాంతాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమచారం.తమిళనాడులో విజయ్ లాగే సువేందు అధికారి కూడా ఈ ఎన్నికల్లో రెండు చోట్ల భవానీపూర్, నందిగ్రామ్ పోటీ చేసి రెండింటిలోనూ ఘనవిజయం సాధించారు. ముఖ్యంగా భవానీపూర్‌లో మమతా బెనర్జీపై 15,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచి 'జెయింట్ కిల్లర్'గా నిలిచారు. 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఉదయం జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా బెంగాల్ గడ్డపై కమల దళం అధికారికంగా పాలనను ప్రారంభించనుంది. సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణా భివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీ లో చేరారు.

## పోలీస్ అధికారి భార్య హత్య

-మొదటిపేజీ తరువాయి

రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు మొదటగా సమాచారం వచ్చిందని తెలిపారు. రిటైర్డ్ డీజీ భార్య తనుజాను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని.. ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ దారుణం చేసిందని తెలిపారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని.. తనుజ గ్రౌండ్ ఫో÷-లోర్‌లో ఉన్నారని వెల్లడించారు. ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్ల పై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం ఆమె హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని.. అప్పటి నుంచి తనుజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాల పై ఆరా తీస్తున్నామని తెలిపారు.

## కృష్ణానగర్ వరదకు పరిష్కారం చూపుతాం

-మొదటిపేజీ తరువాయి

ఈ క్రమంలో కృష్ణానగర్ వరద సమస్యపై హైడ్రా ఫోకస్ పెట్టింది. కృష్ణానగర్ వరద సమస్యను నెల రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. కృష్ణానగర్‌లో కాలువల్లో పూడిక తీత పనులు ముమ్మరం చేసింది హైడ్రా. స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి పనులను పరిశీలించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల వరద కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించారు అధికారులు. నాలాల్లో డీసిల్టింగ్ పనుల్లో జీహెచ్ఎంసీతో కలిసి హైడ్రా భాగస్వామ్యం వహిస్తోంది. ఎగువ ప్రాంతాలైన జూబ్లీహిల్స్, వెంకటగిరి నుంచి వచ్చే మట్టి కారణంగా సమస్య తీవ్రత పెరుగుతోందని అంటున్నారు అధికారులు. వరద నీరు సాఫీగా వెళ్లేందుకు కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు చర్యలు చేపట్టామని అన్నారు. కృష్ణా నగర్ వరద ముప్పుకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రత్యామ్నాయ వరద కాలువ నిర్మాణంపై ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారని..8 నుంచి 9 అడుగుల లోతున్న కాలువల్లో 6 నుంచి 7 అడుగుల మేర పూడిక పేరుకుపోయిందని తెలిపారు అధికారులు. అవసరమైతే స్లాబులు తొలగించి పూర్తి స్థాయిలో పూడిక తొలగిస్తామని స్పష్టం చేశారు కమిషనర్ రంగనాథ్. నాలాపై నిర్మించిన ఒకటి రెండు ఇళ్లను గుర్తించామని... తప్పనిసరి పరిస్థితి వస్తేనే తొలగింపు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇళ్ల ఖాళీ చేయించటానికి ముందు నోటీసులు, తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు కమిషనర్ రంగనాథ్.

## తెలంగాణకు కేంద్ర సహకారం పై చర్చకు సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో మరింత బలోపేతం అవుతామని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు. ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. రూ. 9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని చెప్పారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు. గవర్నర్ చర్యలను బిజెపికి అంటగట్టి విమర్శించడం మానుకోవాలన్నారు.

# సంపాదకీయం

## రక్త 'దాహం'




భూమిని దోచుకుంటూ, వనరులను వశపర్చుకుంటూ, ప్రకృతిని నాశనం చేసుకుంటూ తీసుకొస్తున్న 'అభివృద్ధి' నమూనా చివరకు నీటిచుక్క కోసం ఒకరినొకరు చంపుకునే దారుణస్థితికి తీసుకొచ్చింది. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, ఏకంగా నలభై రెండు మంది చనిపోయారు. ఆఫ్రికాలోని చార్డ్ దేశంలో ఇటీవల జరిగిన ఈ విషాదం మానవ నాగరికత వైఫల్యానికి నిలువెత్తు సాక్ష్యం. వాదీ ఫిరా ప్రావిన్స్‌లో ఉన్న ఒకే బావి స్థానికులకు ఆధారం. కాగా, దాహం తీర్చుకోవడానికి ఆ బావి వద్దకు వెళ్లిన కొంతమంది తిరిగి ఇంటికి రాలేదు. వారికోసం వెళ్లినవారు కూడా అక్కడే నెత్తుటి మడుగులో పడి ఉన్నారు. అక్కడ నీటి కొరత తీవ్రంగా ఉంది. తమకే ఈ నీళ్లు చెందాలని వారిపై దాడికి దిగారు. నీళ్ల కోసం ఇరువురి మధ్య మొదలైన చిన్న ఘర్షణ, క్షణాల్లో రెండు తెగల మధ్య యుద్ధంగా మారి గ్రామాలను రక్తంతో నింపింది. మరో 'పానీ' పట్టు యుద్ధానికి తెరదీసింది. ఓవైపు సాంకేతిక విప్లవం, కృత్రిమ మేధస్సు, అంతరిక్ష విజయాలతో మానవ నాగరికత తనను తాను గొప్పగా చాటుకుంటున్న వేళ.. నీళ్ల కోసం మనుషులు కొట్టుకుని చావడం చూస్తే మనం అభివృద్ధి చెందుతున్నామా? లేదంటే తిరో గమనం వైపు పయనిస్తున్నామా? అన్న ప్రశ్నలు మనల్ని వేధిస్తాయి. ఒకప్పుడు ఆఫ్రికాలో ఇరవై ఐదు వేల చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి, అతిపెద్ద మంచినీటి వనరుగా ఉన్న చార్డ్ జలాశయం పదిహేను వందల చ.కిమీకు తగ్గి, ఇప్పుడు దాదాపు అంతరించేపోయే దశకు చేరింది. వాతావరణ మార్పులు, అడవుల విధ్వంసం, నిర్లక్ష్య పాలన పాలన కలిసి కోట్లాది ప్రజల జీవనాధారాన్ని నాశనం చేశాయి. నీరు తగ్గిన చోట ఆకలికేకలు ఆరంభమయ్యాయి. అకలి కేకల నడుమ వలసలు పెరిగాయి. వలసలు పెరిగిన చోట ఘర్షణలు చెలరేగాయి. చివరకు చుక్క నీటి కోసం మనిషిని మనిషి చంపుకునే పరిస్థితులు వచ్చాయి. ఇదంతా చూస్తే రాబోయే యుద్ధాలు భూమికోసం, అధికారం కోసం కాదు, సహజ వనరుల కోసం జరుగుతాయా? అన్న సందేహం రాకమానదు.

యూనిసెఫ్ 2026 అంచనాల ప్రకారం, సాహెల్ ప్రాంతంలో యాభై శాతం గ్రామీణ జనాభాకు సురక్షితమైన తాగునీరు అందుబాటులో లేదు. పైగా పశువుల మరణాలు పెరగడం, వ్యవసాయ దిగుబడులు తగ్గడం అక్కడ నెలకొన్న భయంకరమైన కరువు పరిస్థితులకు నిదర్శనం. ఈ పరిస్థితులను అధిగమించేందుకు అక్కడి పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా ఈ సంక్షోభానికి కారణాలు అన్వేషించలేదు. కానీ, ఇదంతా పెట్టుబడిదారి విధానాల ఫలితమేనన్న సంగతి మరువరాదు. కార్బన్ ఉద్గారాలకు ప్రధాన కారణమైన అభివృద్ధి చెందిన దేశాలు ప్రకృతి విధ్వంసానికి బాధ్యత వహించకుండా, పేద దేశాల ప్రజలనే వాతావరణ విపత్తుల బలిపీఠంపై నిలబెడుతు న్నాయి. ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం సహజ వనరులను కట్టబెట్టడం వల్లే ఈ పరిస్థితులు పరిణమిం చాయి. ప్రకృతి సంపదను మార్కెట్ వస్తువుగా మార్చిన పెట్టుబడిదారీ వ్యవస్థ ఇప్పుడు దాని మనుగడనే సంక్షోభంలోకి నెట్టింది.

ఈ నేపథ్యంలో భారత పరిస్థితులు కూడా ఏమాత్రం భిన్నంగా లేవు. దేశంలో నీటి సంక్షోభం వేగంగా ముదురుతోంది. ప్రధాన నగరాలు భూగర్భజలాల కొరతను ఎదుర్కొంటున్నట్టు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ గణాంకాలే చెబుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో వరుస ఎండలు రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నా యి. బోర్లు ఎండిపోవడం, చెరువులు కనుమరుగవడం, సాగునీటి కొరత ఏర్పడటం వల్ల గ్రామీణ జీవితం సంక్షోభంలోకి జారుతోంది.అయినప్పటికీ కేంద్రసర్కార్ 'ఇది వేసవికాలంలో మామూలే కదా' అన్న ధోరణితో వ్యవహరిస్తోంది. సమస్య మూలాలను గుర్తించి పరిష్కరించే దిశగా సమగ్ర విధానాలను రూపొందించడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది.

ఓవైపు 'స్మార్ట్‌సిటీలు', 'అభివృద్ధి కారిడార్ల' పేరుతో వేల ఎకరాల పచ్చని భూములను అదానీ,అంబానీలాంటి బడా కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్న బీజేపీ సర్కార్, ఆ భూమినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న పేదలను మాత్రం విస్మరి స్తోంది. జల సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ వంటి అందమైన ప్రకటనలతో ఊదరగొడుతున్నా వాస్తవ పరిస్థితి పాలకుల డొల్లతనాన్ని బయట పెడుతున్నది. ఇప్పటికే అనేక నగరాల్లో తాగునీటి సరఫరా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తోంది. ఇది భవిష్యత్తులో నీటిని డబ్బులున్న వారికే అందుబాటులో ఉండే వస్తువుగా మార్చే ప్రమాదాన్ని పెంచుతోంది. హైదరాబాద్ లాంటి మహా నరగంలో ఒక సామాన్య కుటుంబం నీళ్ల కోసం కూడా నెలకు రూ.రెండు దాకా వెచ్చించాల్సి రావడం బాధాకరం. పాలకవర్గాలు నీటి సమస్యను ప్రజాహక్కు కోణంలో చూడకుండా, ప్రయివేటీ కరణ కోణంలో చూడటమే ఈ ముప్పునకు కారణం. నీటి సంక్షోభం కేవలం ప్రకృతి సమస్య కాదు, అది సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, ప్రజాస్వామ్య హక్కులతో ముడిపడిన అంశం. నీటిని మార్కెట్ శక్తులకు వదిలేస్తే చివరకు జీవన హక్కునే కోల్పోతాం. ఇప్పటికైనా పాలకవర్గాలు మేలుకోల్కోకపోతే చార్డ్ దేశంలో వచ్చిన పరిస్థితి మనదేశంలోనూ రాకమానదు. అప్పుటు రేపటి తరాలు చరిత్రను ఇలా రాయాల్సి వస్తుంది– "మనిషి చంద్రుడిపై కాలుమోపాడు...కానీ భూమిపై నీటిచుక్కను కాపాడుకోలేక తనను తానే నాశనం చేసుకున్నాడు."

# పశ్చిమాసియాలో శాంతి దోబూచులాట!




ఒకవైపు ఇరాన్‌తో యుద్ధం ముగిసిందంటారు, మరోవైపు శాంతి ఒప్పందం కుదరలేదంటారు. మేం చెప్పినట్లుగా వినకపోతే పెద్దఎత్తున తిరిగి దాడులు చేస్తామంటూ ఇంకోవైపు బెదిరిస్తుంటారు. అసలు యుద్ధమే లేదంటూ తమ పార్లమెంటును తప్పుదారి పట్టించారు. లెబనాన్ మీద దాడులను కూడా ఆపాలన్న ఇరాన్ డిమాండ్‌ను పట్టించుకోని అమెరికా ప్రతిరోజూ ఇజ్రాయిల్‌తో జరిపిస్తూనే ఉంది.తాను ప్రారంభించిన ప్రాజెక్టు ఫ్రీడమ్‌ను రెండురోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించాడు. హార్మూజ్ జలసంధిలో చిక్కుకు పోయిన నౌకలకు దారి చూపి గమ్యస్థానాలకు పంపటానికి పెట్టిన పేరు అది. కాల్పుల విరమణకు ప్రకటించిన నెల రోజుల విరామం గురువారం నాటితో ముగిసిపోయింది.ఈ లోగా పాత అంశాలకే కొన్ని మార్పులు చేసి ఇరాన్ కొత్త ప్రతిపాదనలపేరుతో మధ్యవర్తి పాకిస్తాన్‌కు అందచేసింది. వాటిని పరిశీలిస్తున్నా మంటూనే తమతో ఒప్పందానికి రాకపోతే.....తాట తీస్తానంటూ ట్రంప్ పపాటలే పాడుతున్నాడు. ఒప్పందం కుదుర్చుకొనే పరిస్థితి మరింత మెరుగైందని అదే నోటితో చెబుతాడు. అతగాడు ఎన్ని పిల్లి మొగ్గలు వేసినా ఈ పరిస్థితిలో మార్పులేదు. ఐరోపాలోని అమెరికా మిత్రదేశాలన్నీ మరింతదూరం జరుగుతున్నాయి తప్ప చేయూత అందించేందుకు సిద్ధపడటం లేదు.

ఇరాన్ సంక్షోభంలో అనేక దేశాల్లో ఆర్థిక పరిస్థితి అతలాకుతలమవుతున్నది, జనాల మీద ఇంధన భారం విపరీతంగా పెరుగుతున్నది. ఇదిలా ఉండగా బుధవారం నాడు ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అర్ఘాచీ చైనా సందర్శించి అక్కడి నేతలతో తాజాపరిస్థితి గురించి చర్చించటం ప్రాధాన్యత సంతరించుకుంది. వాషింగ్టన్ ఎన్ని బెదిరింపులకు పాల్పడినా వెన్నుదన్నుగా నిలుస్తున్న చైనాను ఇరాన్ నమ్ముతున్నది. ఒప్పందం కుదుర్చుకొనేందుకు ఇరాన్ ప్రతిపాదించిన పద్నాలుగు అంశాలపై రెండు పక్షాలూ క్రమంగా దిగివచ్చేందుకు ప్రాతిపదిక ఉన్నట్లు అమెరికా మీడియా సంస్థలు చెప్పిన కథనాలతో బ్రెంట్ ముడి చమురు ధర 98 డాలర్లకు తగ్గింది.రెండు రోజుల పాటు బలవంతంగా నౌకల విముక్తి పథకాన్ని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన కూడా దీనికి దోహదం చేసింది. యురేనియం శుద్ధిని కొంతకాలం వాయిదా వేసేందుకు ఇరాన్ అంగీకరిస్తే దాని మీద విధించిన ఆంక్షల ను క్రమంగా సడలించటంతో పాటు, స్తంభింపచేసిన ఇరాన్ నిధులను కూడా విడుదల చేసేందుకు అమెరికా సుముఖంగా ఉందని ఊహాగానాలు వెలువడ్డాయి.యురేనియం శుద్ధి హక్కును తాము వదలుకొనేది లేదని తప్ప అణ్వాయుధాలను తయారు చేస్తామని ఇరాన్ ఇంతవరకు ఎప్పుడూ చెప్పలేదు.

అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందానికి (ఎన్‌పిటి) కట్టుబడే ఉన్నామని అంటోంది. ప్రపంచంలో అతిపెద్ద సైనిక శక్తిగా ఉన్న అమెరికా ఇప్పుడేం చేస్తున్నది? ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులను ప్రారంభించటమైతే చేసింది గానీ, ఇప్పుడు ఆ సంక్షోభం నుంచి బయటపడటానికి అమెరికా నానా ఇబ్బందులు పడుతున్నది. చెప్పుకోరాని చోట దెబ్బతగిలితే ఎవరికైనా ఎలా ఉంటుందో ట్రంప్‌ది అదే స్థితి. ఇరాన్ ప్రతిదాడుల్లో జరిగిన నష్టం గురించి చెప్పుకోలేడు, అలాగని దాచుకోలేడు. గల్ఫ్‌లోని పదిహేను అమెరికా మిలిటరీ కేంద్రాలలో 228 కట్టడాలు, ధ్వంసమైన పరికరాలకు సంబంధించి ఇటీవల ఇరాన్ కొన్ని చిత్రాలను విడుదల చేసింది. వాటిలో విమానాలను నిలిపే ప్రాంతాలు, చమురు డిపోలు,విమానాలు, రాడార్లు, సమాచార వ్యవస్థల వంటివి ఉన్నాయి. ఇంతవరకు ఆ చిత్రాలు తిమ్మినిబమ్మిని చేసి చూపినవిగా లేదా కృత్రిమ సృష్టి అని చెప్పలేక అమెరికా ఏవేవో పిట్టకథలను చెబుతున్నది.ఎవరెన్ని చెప్పినా ఇరాన్ గురిచూసి దెబ్బతీసిందని దాడుల సమయంలోనే వార్తలొచ్చినందున అలాంటి కథలను నమ్మాల్సిన అవసరం లేదు.ట్రంప్ చెప్పి నట్లుగా మరిన్ని దాడులకు పాల్పడితే ఇదే మాదిరి పరాభవం ఎదురుకావచ్చునే హెచ్చరికలే భూతల దాడులకు దిగకుండా అమెరికా మిలిటరీ జాగ్రత్తపడుతున్నదని చెప్పవచ్చు. ఇరాన్‌పై దాడులతో తమకు 25బిలియన్ డాలర్ల మేర నష్టం వచ్చినట్లు రక్షణశాఖ కబుర్లు చెబుతున్నది. కానీ, ఇది 50బిలియన్ డాలర్లకు పైమాటే ఉంటున్నట్టు తెలుస్తోంది. వర్తమాన సంవత్సరంతో పోల్చితే 42శాతం పెంచి వచ్చే ఏడాది రక్షణ బడ్జెట్‌ను 1.5లక్షల కోట్ల డాలర్లకు పెంచాలని ప్రతిపాదిస్తున్నారంటే ఎంతగా దెబ్బతిన్నదో చూడవచ్చు. పశ్చిమాసియా, మధ్య ప్రాచ్య ప్రాంతంలో జరిగిన నష్టాలకు సంబంధించిన చిత్రాలను విడుదల చేయవద్దని వాణిజ్య ఉపగ్రహ కంపెనీలను ట్రంప్ యంత్రాంగం ఆదేశిం చిందంటేనే అది ఎంతగా మూసిపెడుతోందో తెలుస్తోంది. ఇరాన్ విడుదల చేసిన చిత్రాలు చైనా, రష్యా ఉపగ్రహాలు తీసినవని వేరే చెప్పనవసరం లేదు. ఎందుకంటే టెహరాన్‌కు అలాంటి వ్యవస్థలు లేవు. గురిచూసి అమెరికా లక్ష్యాలను దెబ్బతీయటం కూడా ఆయా దేశాలం దించిన సమాచారం, ఐరోపా సంస్థలు విడుదల చేసిన సమాచారం, చిత్రాలతోనే సాధ్యమైంది. పిల్లి చెలగాటం ఎలుకలకు ప్రాణ సంకటం అన్నట్లుగా అమెరికా వైఖరి మనతో సహా అనేక దేశాలకు ఇబ్బందులను తెస్తున్నది. అందువలన ఇరాన్ న్యాయమైన డిమాండ్లను అంగీకరించి శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని యావత్ ప్రపంచం వత్తిడి తేవాల్సి ఉంది!

# ఉక్రోషదాడుల ఉత్తరువు!



అమెరికా,ఇజ్రాయిల్ ప్రారంభించిన ఏకపక్ష దాడులు, దానికి ఇరాన్ ప్రతిఘటనకు రెండు నెలలు గడచిపోయాయి. ఏప్రిల్ ఏడు నుంచి తాత్కాలిక కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది.తొలుత హార్మూజ్ జలసంధిని ఇరాన్ ఒక్కటే దిగ్బంధిస్తే తరువాత అమెరికా మరోవైపునుంచి నౌకలను మలేస్తున్నది.ఈ పరిస్థితిలో ఎప్పుడు మార్పు వస్తుందో తెలియదు.

అమెరికా రాజ్యాంగం ప్రకారం అరవై రోజులకు మించి అధ్యక్షుడి ఉత్తరువులతో ఏదేశం మీద కూడా సైనిక చర్య జరిపేందుకు వీల్లేదు. దీంతో చట్టంలో ఉన్న అవకాశాన్ని వినియోగించుకొని మరో నెల రోజుల పాటు ఇరాన్ మీద దాడులను పొడిగిస్తూ ఏప్రిల్30న ట్రంప్ ఉత్తరువులు జారీ చేశాడు.కాల్పుల విరమణ వ్యవధిలో మరిన్ని బలగాలను సమీకరించేందుకు వినియోగించుకుంటున్నట్లు ఇరాన్ చెబుతున్న సంగతి తెలిసిందే. ఇరాన్ మీద మరోసారి దాడులకు తెగబడితే తీవ్రమైన హానికర పర్యవసానాలు ఉంటాయని, ఇది ఏమాత్రం సమర్థనీయం కాదని రష్యా అధ్యక్షుడు పుతిన్ అమెరికాను హెచ్చరిం చాడు. ట్రంప్‌తో గంటన్నర పాటు ఫోన్‌లో మాట్లాడిన అనేక అంశాల్లో ఇదో హెచ్చరిక. భూతల దాడులకు దిగాలని చేస్తున్న ప్రయత్నాల గురించి తమనేత ట్రంప్‌ను హెచ్చరించినట్లు పుతిన్ విదేశాంగవిధాన సలహాదారు చెప్పాడు. పుతిన్‌తో సంభాషణ తరువాత తాము మంచిగా మాట్లాడుకున్నామని, తనకు పుతిన్ ఎప్పటి నుంచో తెలుసని ట్రంప్ చెప్పుకున్నాడు. ఇరాన్ యురేనియంను అవసరమైతే తమ ఆధీనంలో ఉంచుకుంటామని పుతిన్ చెప్పగా ఉక్రెయిన్‌లో పోరును ముగించాలని కోరుకుంటున్నట్లు ట్రంప్ చెప్పాడట.

పశ్చిమాసియాలో అమెరికా సృష్టించిన సంక్షోభం ప్రారంభమై రెండు నెలలు దాటింది. ఇరాన్ మీద తాము సైనిక చర్యను ప్రారంభించామే తప్ప దాన్ని యుద్ధంగా తాను పిలవటం లేదని ఏప్రిల్ ఒకటవ తేదీన చేసిన ప్రసంగంలో ట్రంప్ యావత్ అమెరికాను వెర్రి వెంగళప్పలను చేశాడు. ఎందుకంటే అమెరికా రాజ్యాంగం ప్రకారం మరొక దేశం మీద యుద్ధం చేయాలంటే అక్కడి పార్లమెంటు ఆమోదం అవసరం.దానితో నిమిత్తం లేకుండానే ట్రంప్ గతేడాది, ఇప్పుడు కూడా దాడులకు ఆదేశించాడు.రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని ఎంత పరిహాస ప్రాయంగా మార్చారో ఇంతకంటే నిదర్శనం అవసరం లేదు.అధ్యక్షుడి మిలిటరీ చర్య ఉత్తరువుల వ్యవధి అరవై రోజుల్లో ముగుస్తుంది. తరువాత దాడులను నిలిపివేయాల్సి ఉంటుంది. అయితే మరో నెల రోజుల పాటు పొడిగించేందుకు రాజ్యాంగంలో వీలు వుండటంతో ఆ మేరకు మరో 30రోజులు దాడులను పొడిగించేందుకు ఏప్రిల్ 30న ఉత్తరువుల మీద సంతకం చేస్తూ మరోసారి అదే చెప్పాడు.దీన్ని బట్టి ఇరాన్ మీద మరోసారి తెగబడేందుకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే పుతిన్ గట్టి హెచ్చరిక చేసినట్లు భావించాల్సి వస్తోంది.

ఇరాన్‌పై వాషింగ్టన్ చెలగాటం మనతో సహా అనేక దేశాలకు ప్రాణ సంకటంగా మారింది. మే ఒకటవ తేదీ నుంచి వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరను చమురు సంస్థలు రూ.2,078 నుంచి రూ.3071కి పెంచాయి. ముందుగా ఊహించినట్లుగా ఇది ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన తరువాత ఈ బండను మోపారు. దేశ చరిత్రలో ఇదొక రికార్డు, దీన్ని నరేంద్రమోడీకే అంకితం ఇవ్వాలి.పెంచింది వాణిజ్య సిలిండర్ ధరేగా అని ఎవరైనా అతితెలివి ప్రదర్శించవచ్చు. గృహం, వాణిజ్య సిలిండర్ పేరు ఏదైతేనేం, భారాన్ని భరించేది జనమే. ధరల పెంపుదల లేదు అంటూ రోజూ ఊదరగొడుతున్నవారు ఇప్పటికే పవర్ పెట్రోలు, పారిశ్రామిక అవసరాల డీజిల్,గృహ, వాణిజ్య వినియోగగ్యాస్ ధరలను పెంచారు.నష్టాలు వస్తున్న మార్కెటింగ్ కంపెనీలను ఆదుకొనేందుకు పన్నెండు సంవత్సరాలుగా జనం జేబులను కొల్లగొడుతున్నది. అదనపు ఎక్సయిజ్ డ్యూటీని కేంద్రం తగ్గించుకుంది, దీంతో వినియోగదారులకు ఒరిగేదేమీ లేదు.ఈ మొత్తంలో రాష్ట్రాలకు వాటా లేదు గనుక మౌనంగా ఉన్నాయి.ఇప్పటికీ సెస్‌ల రూపంలో రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం లీటరు పెట్రోలుకు రూ.7.50, డీజిలు మీద రూ.6, అదనంగా కస్టమ్స్,మొత్తం డ్యూటీల మీద పదిశాతం చొప్పున సంక్షేమ సర్‌ఛార్జీ వసూలు చేసుకుంటున్నది.

# ఆర్టీసీ విలీనంపై మళ్లీ రగిలిన ఉద్యమం

-ఆర్టీసీ విలీనంపై మళ్లీ వేడెక్కిన ఉద్యమం..
-జూన్ 2పై ఉద్యోగ సంఘాల భారీ ఆశాలు..
-ప్రభుత్వం నిర్ణయం కోసం ఉద్యోగుల ఉత్కంఠ..
-విలీనం సాధించేవరకు పోరాటం తప్పదన్న నేతలు..

హంసకలం వార్త, తెలుగు దినపత్రిక .. మే 8, 2026





తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలన్న డిమాండ్ మరోసారి బలంగా వినిపించింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న అధికారిక అపాయింటెడ్ డేట్ ప్రకటించాలని కోరుతూ ఆర్టీసీ ఉద్యోగ సంఘం నాయకులు సంస్థ యాజమాన్యాన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న ఆధ్వర్యంలో నాయకుల బృందం సంస్థ ఉపాధ్యక్షుడు నాగిరెడ్డిని కలిసి విలీనానికి సంబంధించిన విధివిధానాలతో కూడిన సమగ్ర నివేదిక అందించారు. ఆర్టీసీ ఉద్యోగుల భవిష్యత్తు, సేవా భద్రత, ప్రభుత్వ ఉద్యోగులతో సమాన హక్కుల అంశాలను నివేదికలో ప్రస్తావించారు. ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడి దశాబ్దం పూర్తవుతున్నా ఆర్టీసీ ఉద్యోగుల విలీనం ఇంకా అమలు కాకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో శంకర్ గౌడ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు ప్రతి ఉద్యోగి మే నెల జీతం నుంచి రూ.300 చొప్పున విరాళంగా కేటాయించాలని యాజమాన్యానికి లేఖ అందజేశారు. ఉద్యోగ సంఘం సమర్పించిన నివేదికను పరిశీలించి ప్రభుత్వానికి పంపిస్తామని, యాజమాన్య స్థాయిలో విలీన ప్రక్రియకు అవసరమైన సహకారం అందిస్తామని నాగిరెడ్డి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. గోపాల్, జె. రాఘవులు, నగేష్ పటేల్, శరణప్ప పాపయ్య గౌడ్, ఏఎస్ రెడ్డి, నరేందర్, టీఎస్ రెడ్డి, అలీ, ఉప్పలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రేమ వ్యవహారం రక్తపాతం.. నడిరోడ్డుపై దారుణ హత్య..



సికింద్రాబాద్, హంసకలం వార్త,

తెలుగు దినపత్రిక .. 08- మే -26- జవహర్‌నగర్‌కు చెందిన 23 ఏళ్ల యువకుడు యావన్‌ను ఆరుగురు దుండగులు కత్తులతో దాడి చేసి నడిరోడ్డుపై దారుణంగా హతమార్చిన ఘటన సీతాఫల్‌మండి ప్రాంతంలో సంచలనం రేపింది. గత నాలుగేళ్లుగా సీతాఫల్‌మండి ప్రాంతానికి చెందిన యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తున్న యావన్ ప్రస్తుతం ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ విషయం తెలిసిన యువతి కుటుంబ సభ్యులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ అతడు వెనక్కి తగ్గకుండా స్నేహితుడి ఇంట్లో ఉంటూ తరచూ యువతిని కలుస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి మూడు ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఆరుగురు దుండగులు యావన్‌పై కత్తులతో విరుచుకుపడ్డారు. ప్రాణభయంతో అక్కడి నుంచి పరుగులు తీసినా వెంబడించి నడిరోడ్డుపైనే విచక్షణారహితంగా దాడి చేశారు. శరీరంపై 17 కత్తిపోట్లు పడటంతో యావన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు..

# జర్నలిస్టుల ఐక్యతకు ఖమ్మంలో కొత్త వేదిక

-మీడియా ప్రతినిధులకు ప్రెస్ క్లబ్ పిలుపు..

ఖమ్మం, హంసకలం వార్త, తెలుగు దినపత్రిక 08- మే -26



ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పాత్రికేయులు, డిజిటల్ మీడియా ప్రతినిధులు, దృశ్య మాధ్యమ కార్యకర్తలు, ఛాయాగ్రాహకులకు ఖమ్మం జిల్లా ప్రెస్ క్లబ్ సభ్యత్వ నమోదుకు ఆహ్వానం పలికినట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఐ. ప్రభాకర్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రెస్ క్లబ్ ప్రారంభ కార్యక్రమానికి మీడియా వర్గాల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. జర్నలిస్టుల హక్కులు, ఐక్యత, సంక్షేమ పరిరక్షణే లక్ష్యంగా ప్రెస్ క్లబ్‌ను బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి దశలో తాత్కాలిక కమిటీతో ప్రారంభమైన ప్రెస్ క్లబ్‌ను ఇప్పుడు పూర్తి స్థాయి కమిటీగా విస్తరించేందుకు జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రతి మీడియా ప్రతినిధి సభ్యత్వం పొందుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులు, ప్రజలు సమావేశాలు నిర్వహించు కునేందుకు ఆధునిక సౌకర్యాలతో ప్రెస్ క్లబ్‌ను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉచిత అంతర్జాల సేవలు, శుద్ధి చేసిన తాగునీరు, శీతలీకరణ హాళ్లు, సాధారణ సమావేశ మందిరాలు, మరుగుదొడ్లు, నిఘా కెమెరా వ్యవస్థ వంటి వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. సాధారణ సమావేశాలకు రూ.600, వాణిజ్య సమావేశాలకు రూ.1000 రుసుము నిర్ణయించినట్లు వెల్లడించారు..

# కాలనీలో చెత్త తొలగింపు..ఇక రోడ్లపై చెత్త వేస్తే చర్యలు..



అల్విన్ కాలనీ, హంసకలం వార్త, తెలుగు దినపత్రిక .. 08- మే -26-

ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పలను తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గతంలో నిర్వహించిన పాదయాత్రలో కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించి జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ జోక్యంతో అధికారులు స్పందించి శుభ్రత పనులు చేపట్టినట్లు వెంకటేష్ గౌడ్ తెలిపారు. కాలనీల్లో దశలవారీగా చెత్త, మట్టి తొలగింపు కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త సేకరణ వాహనాల్లో వేయాలని సూచించారు. రోడ్లు, నాలాలు, చెరువుల్లో చెత్త వేయవద్దని విజ్ఞప్తి చేశారు. కాలనీ పరిశుభ్రత కోసం అధికారులు, కాలనీ సంఘాలు, ప్రజలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాస్కర్, నాగేశ్వర నాయక్, మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు..

# ప్రాణహిత ప్రాజెక్టుపై వేగం పెంచిన సర్కార్





హంసకలం వార్త, తెలుగు దినపత్రిక 08- మే -26

ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించనున్న ప్రాణహిత బ్యారేజ్ స్థలాన్ని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి పరిశీలించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొన్నారు. బ్యారేజ్ ఎత్తు, కాల్వల సామర్థ్యం, నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై సాగునీటి శాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తుమ్మిడిహెట్టి పుష్కర ఘాట్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు తెలంగాణ ప్రభుత్వం తరపున సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ పంపినట్లు వెల్లడించారు. వచ్చే వారం మహారాష్ట్ర ప్రభుత్వంతో సమావేశమై బ్యారేజ్ ఎత్తుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టును మేడిగడ్డకు మళ్లించడం వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని విమర్శించారు. ప్రాజెక్టు ద్వారా నీటి వినియోగం, సాగు విస్తీర్ణం పెరుగుదల, స్థానిక ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అధికారులు సమగ్ర వివరాలు అందించారు. కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ హరిత, ఉప కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు కలెక్టర్ డేవిడ్, సాగునీటి శాఖ అధికారులు పాల్గొన్నారు..

# చెత్త కుప్పలపై కెమెరా కన్ను..

-చెత్త వేయొద్దు..కెమెరా చూస్తోంది..
-మూసాపేట్‌లో చెత్త రాజ్యానికి చెక్..
-పారిశుద్ధ్యానికి మాజీ కార్పొరేటర్ ముందడుగు..

మూసాపేట్,(హంసకలం వార్త, తెలుగు దినపత్రిక 08- మే -26-)





మూసాపేట్ ఇందిరా నగర్ పరిధిలో గోడౌన్ రోడ్డును చెత్తాచెదారంతో నింపి కొందరు చెత్త నిల్వ కేంద్రంగా మార్చడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన, దోమలు, వ్యాధుల భయంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేయగా సమస్యను స్థానికులు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన ఆయన పారిశుద్ధ్య అధికారులతో మాట్లాడి చెత్త తొలగింపునకు చర్యలు చేపట్టించారు. అనంతరం తన స్వంత ఖర్చులతో గోడలకు రంగులు వేయించి పరిసరాలను శుభ్రంగా మార్చించారు. మళ్లీ చెత్త వేయకుండా ఆధునిక సాంకేతికత కలిగిన నిఘా కెమెరాను ఏర్పాటు చేయించారు. దీంతో ప్రాంతంలో పారిశుద్ధ్య పరిస్థితి మెరుగుపడిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ తూము శ్రావణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుకారాం, బాలరాజు గౌడ్, తూము నిఖిల్ కుమార్, యాదిలాల్, శ్రీనివాస్, స్వామి గౌడ్, శివరాజ్ గౌడ్, శోభ పాల్గొన్నారు..

# జూబ్లీహిల్స్‌లో మాజీ డీజీ భార్య దారుణ హత్య..

జూబ్లీహిల్స్(హంసకలం వార్త, తెలుగు దినపత్రిక 08- మే -26-)



జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో మాజీ డీజీ వినయ్ రంజన్ రాయ్ భార్య తనూజ (55) దారుణ హత్య కలకలం రేపింది. ఈ ఘటనపై నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ మీడియాతో వివరాలు వెల్లడించారు. గురువారం అర్ధరాత్రి అనంతరం ఇద్దరు చిన్నారులు పై అంతస్తులో నిద్రిస్తున్న వేళ, కింది అంతస్తులో ఒంటరిగా ఉన్న తనూజను దుండగులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి హత్య చేసినట్లు తెలిపారు. ఈ హత్యలో ఇంటి పనిమనిషి కల్పన కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కల్పన బయట వ్యక్తులతో సంబంధాలు పెట్టుకుని, వెనుక ద్వారం ద్వారా దుండగులను ఇంట్లోకి చేర్చినట్లు వెల్లడించారు. ఈ ఘటన నేపాలి ముఠా పని కావచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనాస్థలం వద్ద లభించిన ఆధారాలపై ప్రత...

# కుత్బుల్లాపూర్ డిగ్రీ కళాశాల... నిర్మాణానికి అడుగులు..



కుత్బుల్లాపూర్, (హంసకలం వార్త, తెలుగు దినపత్రిక 08- మే -26-)

కుత్బుల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని కోరుతూ కళాశాల ప్రతినిధులు బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతిపత్రం సమర్పించారు. కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కళాశాల ప్రధానాచార్యుడు బండి రాజు, ఉప ప్రధానాచార్యుడు కె. శ్రీధర్ కలిసి కళాశాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో కేటాయించిన స్థలంలో డిగ్రీ కళాశాల నిర్మాణాన్ని ప్రారంభించాలని కోరారు. అలాగే సూరారంలోని తాత్కాలిక కళాశాల ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం లేక డిగ్రీ, ఇంటర్, వృత్తి విద్య కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ వెంటనే ఆర్వో నీటి కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో సూరారంలో ప్రభుత్వ జూనియర్, వృత్తి విద్య కళాశాలలతో పాటు డిగ్రీ కళాశాల కూడా ప్రారంభించామని తెలిపారు. డిగ్రీ కళాశాల కోసం హెచ్ఎంటి స్థలంలో నాలుగు ఎకరాలు కేటాయించినప్పటికీ ప్రభుత్వ మార్పుతో ప్రక్రియ ఆలస్యమైందన్నారు. త్వరలో ఉన్నతాధికారులతో చర్చించి స్థల కేటాయింపు, భవన నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా సూరారం ప్రభుత్వ కళాశాలల సముదాయంలో ఆర్వో నీటి కేంద్రం ఏర్పాటుకు కూడా కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు..

# పేదలకు అండగా ఎన్ఎఫ్‌బీఎస్

-కుటుంబ పెద్ద మరణిస్తే రూ.20 వేల ఆర్థిక సాయం

-2025-26లో 15,420 మంది లబ్ధిదారులు

-ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం




మే 8 (హంసకలం వార్త,

పేద కుటుంబాల్లో ఆర్థిక ఆధారమైన వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం తీవ్రమైన ఇబ్బందుల్లో పడకుండా వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 1995లో నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ (చీఖీదశే)ను తీసుకొచ్చింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఒకేసారి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేస్తారు. బీఆర్ఎస్ పాలనలో ఈ పథకం నిర్లక్ష్యానికి గురైంది. ఈ పథకాన్ని ప్రజలకు చేరవేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టడంతో రెండున్నర ఏండ్లలో భారీ సంఖ్యలో లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందింది. 2022-23లో కేవలం 603 మందికి మాత్రమే సాయం అందగా, 2023-24లో 577 మందికి మాత్రమే ప్రయోజనం కలిగింది. 2014-15 నుంచి 2024-25 వరకు మొత్తం 20,663 మంది లబ్ధిదారులకు సాయం అందగా, కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే ఏకంగా 15,420 మంది లబ్ధిదారులకు రూ.30.84 కోట్ల ఆర్థిక సహాయం అందింది.

అర్హులు దరఖాస్తు చేసుకోండి : పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగి అర్హులైన బీపీఎల్ కుటుంబాలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కోరారు. మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. పేద కుటుంబాలకు కష్టసమయంలో భరోసా కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమనీ, అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం చేరేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

కావలసిన పత్రాలు

8బీపీఎల్ సర్టిఫికేట్

8కుటుంబ పోషకుడి మరణ ధృవీకరణ పత్రం

8గుర్తింపు పత్రం( ఆధార్, రేషన్ కార్డు మొదలైనవి)

8మరణించిన వారి వయస్సు ధృవీకరణ పత్రం.

అర్హతలు

8మరణించిన వ్యక్తి వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలి.

8మరణించిన ఏడాది లోపు దరఖాస్తు చేసుకోవాలి

8సహజ, ప్రమాదవశాత్తు మరణాలు రెండింటినీ కవర్ చేస్తుంది.

8మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

8ఆఫ్‌లైన్‌లో అయితే... స్థానిక తహసీల్దార్, సబ్-డివిజనల్ అధికారి లేదా సాంఘీక సంక్షేమ శాఖ ద్వారా

# అధికారుల ఆశీస్సులతో.. అక్రమాలకు పండగ..

-అనుమతుల్లేని అంతస్తుల నిర్మాణాలు..అధికారులు మాత్రం మౌనం..

-ఫిర్యాదులు, వార్తలు వచ్చిన.. అధికారులు మౌనం వెనుక ముడుపులా?..

-టౌన్ ప్లానింగ్ అధికారులపై తీవ్ర అవినీతి ఆరోపణలు..

-హైడ్రా ఎంట్రీ కావాలి.. కాలనీవాసుల డిమాండ్..

హైదర్ నగర్, హంసకలం వార్త, తెలుగు దినపత్రిక .. 08- మే -26-

సర్కిల్-51 టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతి ఆరోపణలతో మళ్లీ వార్తల్లోకెక్కింది. హైదర్ నగర్ డివిజన్ పరిధిలో నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నా, టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పత్రికల్లో వరుస కథనాలు, స్థానికుల ఫిర్యాదులు, ఫోటో ఆధారాలు బయటకు వస్తున్నా అధికార యంత్రాంగంలో చలనం కనిపించకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. రామ్ నరేష్ నగర్ రోడ్ నెం.3, ప్లాట్ నెం.42లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. శ్రీనివాస్ నగర్ ప్లాట్ నెం.9, 10లో సెట్‌బ్యాక్స్ లేకుండానే భారీ భవనం నిర్మాణం జరుగుతుండగా, జై భారత్ నగర్ డోర్ నెం.1-2-29/5 వద్ద అదనపు అంతస్తులు యథేచ్ఛగా వేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు..




నోటీసులు ఇచ్చాం..ఆ తర్వాత?..

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తే నోటీసులు ఇచ్చాం అనే ఒకే మాటతో అధికారులు తప్పించుకుంటున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఒక్క నిర్మాణాన్నీ ఆపకుండా పూర్తి చేయిస్తున్నారంటూ టౌన్ ప్లానింగ్ అధికారులపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మామూళ్లు ఉంటే మ్యాపులు అవసరమా? అన్న చర్చ ఇప్పుడు స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది.

హైడ్రా ఎంట్రీ కావాలంటున్న ప్రజలు..

పత్రిక కథనాలకూ స్పందించని అధికారులపై హైడ్రా, ఏసీబీ వంటి దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలతో డ్రైనేజీ, రోడ్లు, ప్రజా సౌకర్యాలు భవిష్యత్తులో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

అధికారులను నిలదీస్తున్న ప్రజలు..

సాక్ష్యాలతో వార్తలు వచ్చినా చర్యలు ఎందుకు లేవు?..

చిన్న నిర్మాణాలపై వెంటనే స్పందించే అధికారులు...భారీ అక్రమ కట్టడాలపై ఎందుకు మౌనం?..

ఉన్నతాధికారుల ఆశీస్సుల్లేకుండా ఇవి సాధ్యమా?..

ఇప్పటికైనా జోనల్ కమిషనర్, ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..

# అనుమతుల్లేని స్కూళ్లపై విద్యాశాఖ కఠిన ఫోకస్..

-అనుమతుల్లేని పాఠశాలలకు హెచ్చరిక..

-గడువు ముగిసిన గుర్తింపులు వెంటనే పునరుద్ధరణ..

-నోటీసులు లేకుండానే కఠిన చర్యలు..

-గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే అడ్మిషన్లు.

కూకట్‌పల్లి, మే 8 (హంసకలం వార్త, తెలుగు దినపత్రిక

కూకట్‌పల్లి మండలంలోని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలకు మండల విద్యాధికారి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతులు, గుర్తింపు పత్రాలు, వాటి గడువు తేదీలను తప్పనిసరిగా పరిశీలించుకుని, అనుమతుల పరిధిలోనే తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. గడువు ముగిసిన అనుమతులు కలిగిన పాఠశాలలు సంబంధిత నిబంధనల ప్రకారం వెంటనే పునరుద్ధరణ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.



అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలను నిర్వహించినా, అదనపు విభాగాలు ప్రారంభించినా, ప్రాథమిక పూర్వ విద్యా తరగతులు నిర్వహించినా విద్యాశాఖ ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే కఠిన చర్యలు చేపడుతుందని హెచ్చరించారు. అవసరమైతే పాఠశాలలపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మండల పరిధిలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు తమ అనుమతుల వివరాలు, గడువు తేదీలు, గుర్తింపు సంఖ్యలను పాఠశాల ప్రకటన ఫలకంపై స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చేర్పించే పాఠశాలలకు సంబంధించిన ప్రభుత్వ అనుమతుల వివరాలు తెలుసుకుని, చట్టబద్ధ గుర్తింపు కలిగిన విద్యాసంస్థలలోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని విద్యాశాఖ స్పష్టం చేసింది. అక్రమంగా నడుస్తున్న పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు..

# అయ్యప్ప ఆశీస్సులతో వార్షికోత్సవ వేడుకలు

చింతల్, (హంసకలం వార్త, తెలుగు దినపత్రిక 08- మే -26- )

128వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయం ఆవరణం భక్తులతో కిక్కిరిసిపోగా ప్రత్యేక పూజలు, అర్చనలు, భజనలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మార్గం నియమం, నిష్ఠ, భక్తి, క్రమశిక్షణకు ప్రతీక అని అన్నారు. మనిషి జీవితంలో ఆధ్యాత్మికత పెరిగితే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొంటాయని పేర్కొన్నారు. యువత మంచి



మార్గంలో నడవాలంటే ధార్మిక విలువలు ఎంతో అవసరమని తెలిపారు. అయ్యప్ప దీక్షలో ఉండే నియమాలు ప్రతి ఒక్కరి జీవితాన్ని సన్మార్గంలో నడిపిస్తాయని చెప్పారు. ఆలయాలు కేవలం పూజలకే పరిమితం కాకుండా సమాజానికి ఆధ్యాత్మిక చైతన్య కేంద్రాలుగా నిలవాలని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ



భక్తుల ఐక్యతతో దేవాలయ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నరేష్ చిట్యాల, రవీందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, నిడికొండ శివ, సూర్యచంద్ర, జితేందర్‌రెడ్డి, పెంటయ్య, స్థానిక నాయకులు దేగ కృష్ణమూర్తి, సాంబయ్య, శ్రీధర్ గౌడ్, బీసు వెంకటేష్ గౌడ్, శ్రీశైలం యాదవ్, శివతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు..

# 100 ఫీట్ రహదారి విస్తరణకు వేగం

ఆల్విన్ కాలనీ,(హంసకలం వార్త, తెలుగు దినపత్రిక 08-మే-26)

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో ఉషముళ్లపూడి కమాన్ నుంచి గాజులరామారం వరకు ఎల్లమ్మబండ మీదుగా చేపడుతున్న 100 ఫీట్ ప్రధాన రహదారి విస్తరణ పనులను ప్రజా ఖాతాల సంఘం చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రహదారి విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఉషముళ్లపూడి కమాన్ నుంచి సిక్కుల బస్తీ వరకు గతంలో అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన విషయాన్ని గుర్తు చేశారు. రహదారి విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. రహదారి మధ్యలో ఉన్న



భారీ బండరాళ్ల తొలగింపు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. విస్తరణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్థంభాల స్థాన మార్పు త్వరగా పూర్తి చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రహదారి మధ్య విభజన భాగంలో సుందరీకరణ పనులు కూడా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. 100 ఫీట్ రహదారి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు



సమయం, ఇంధనం ఆదా అవుతాయని గాంధీ పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనకు తనవంతు కృషి కొనసాగుతుందని, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో ఎర్రగడ్ల శ్రీనివాస్ యాదవ్, హరికృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు..

# గంగకత్వకు కొత్త జీవం..

-గంగకత్వకు గ్రీన్‌సిగ్నల్.. రూ.42 కోట్ల మంజూరు..
-జగ్గారెడ్డి చొరవతో నిజాం కాలువకు కొత్త జీవం..
-15 కి.మీ కాలువ ఆధునీకరణ.. 3 వేల ఎకరాలకు సాగునీరు..
- సీఎం రేవంత్ చేతుల మీదుగా త్వరలో శంకుస్థాపన..

సదాశివపేట్, (హంసకలం వార్త, తెలుగు దినపత్రిక 08-మే-26)



దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన నిజాం కాలం నాటి గంగకత్వ కాలువకు ఎట్టకేలకు పునర్జన్మ లభించనుంది. సదాశివపేట మండలం సూరారం గ్రామం నుంచి ప్రారంభమయ్యే గంగకత్వ కాలువ ఆధునీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం నెలకొంది. జగ్గారెడ్డి చొరవతో రూ.42 కోట్ల నిధుల విడుదలకు ప్రభుత్వం సమ్మతి తెలిపింది. గత రెండు నెలలుగా గంగకత్వ కాలువ ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టిన జగ్గారెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. అధికారులు రూపొందించిన రూ.42 కోట్ల ప్రతిపాదనలకు తాజాగా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ అంశంపై సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో జగ్గారెడ్డి సమావేశమై పనుల పురోగతిపై చర్చించారు. సూరారం నుంచి మాచిరెడ్డిపల్లి వరకు సుమారు 15 కిలోమీటర్ల పొడవున విస్తరించిన గంగకత్వ కాలువ 11 గ్రామాలకు అనుసంధానంగా ఉంది. కాలువకు అనుబంధంగా 33 చెరువులకు ఫీడర్ మార్గాలు ఉన్నాయి. ఆధునీకరణలో భాగంగా కాలువకు లైనింగ్ పనులు, కొత్త వంతెనల నిర్మాణం, పాత వంతెనల మరమ్మత్తులు, తూముల పునరుద్ధరణ చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే సుమారు 3 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. త్వరలో సంగారెడ్డి పర్యటనకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గంగకత్వ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్‌చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులకు జగ్గారెడ్డి వివరించారు..

# శేరిలింగంపల్లి రాజకీయాల్లో కొత్త శక్తి..

కూకట్‌పల్లి, (హంసకలం వార్త, తెలుగు దినపత్రిక 08-మే -26)



ప్రజా సేవనే తన జీవిత లక్ష్యంగా పెట్టుకుని ప్రజల మధ్య ముద్ర వేసుకుంటున్న బోనాల మహేష్ లడ్డా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తనదైన ప్రత్యేక గుర్తింపును సాధిస్తున్నారు. అంజయ్యనగర్‌లో నివాసముంటున్న ఆయన, రాజకీయాల్లో పార్టీ అండ లేకుండా గెలుపు సాధ్యం కాదన్న భావనకు భిన్నంగా స్వతంత్రంగా ముందుకు సాగుతూ యువతలో కొత్త ఉత్సాహాన్ని రగిలిస్తున్నారు. పార్టీ జెండా లేకున్నా ప్రజా సేవే తన అజెండాగా ముందుకు సాగుతున్న మహేష్ లడ్డాపై స్థానిక ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. సాధారణంగా నాయకులు పార్టీ అధిష్ఠానం దృష్టిలో పడేందుకు ప్రయత్నిస్తుంటే, ఆయన మాత్రం ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తూ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదిస్తున్నారు. పార్టీల కట్టుబాట్లు, ఆదేశాలకు పరిమితం కాకుండా నేరుగా ప్రజల వద్దకు చేరి సమస్యలపై పోరాటం చేయడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోంది. పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్న వారికి వెంటనే స్పందిస్తూ సహాయం చేయడం వల్ల ఆయనపై స్థానికంగా విశేష చర్చ జరుగుతోంది.
శేరిలింగంపల్లిలో లడ్డా యువత శక్తి నియోజకవర్గ యువతలో మార్పు ఆకాంక్ష పెరుగుతోంది. రాజకీయాల కంటే సామాజిక బాధ్యతే ముఖ్యమని నమ్మే మహేష్ లడ్డా వెనుక పెద్ద సంఖ్యలో యువత స్వచ్ఛందంగా చేరుతోంది. మన సమస్యలకు మనమే పరిష్కారం అనే నినాదంతో ఆయన ముందుకు సాగుతున్నారు. ప్రధాన పార్టీల పట్ల అసంతృప్తిగా ఉన్న సామాన్య ప్రజలకు మహేష్ లడ్డా ఒక ప్రత్యామ్నాయ శక్తిగా కనిపిస్తున్నారు. చదువుకున్న యువత, ఐటీ రంగ ఉద్యోగులు సైతం ఆయన భావజాలానికి మద్దతు తెలుపుతున్నారు. అధికారం కోసం కాదు అభివృద్ధి కోసమే అన్న ధ్యేయంతో తన వ్యక్తిగత ఆదాయంలో కొంత భాగాన్ని నియోజకవర్గ అభివృద్ధికి, పేదల విద్యా, వైద్య అవసరాలకు వినియోగిస్తూ నిజమైన ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందుతున్నారు. పార్టీల మధ్య రాజకీయ విమర్శలకు దూరంగా ఉండి సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇవ్వడం ప్రత్యర్థుల్లోనూ ఆలోచన కలిగిస్తోంది.
శేరిలింగంపల్లి ప్రజలే తన కుటుంబమని, వారి ఆశీర్వాదమే తన బలమని మహేష్ లడ్డా పేర్కొంటున్నారు. ఇండిపెండెంట్ నాయకుడిగా ఆయన పెరుగుతున్న ప్రభావంతో శేరిలింగంపల్లి రాజకీయాల్లో రాబోయే రోజుల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశముందని స్థానికంగా చర్చ సాగుతోంది. ప్రజలు వ్యక్తిత్వానికే పట్టం కడతారని మహేష్ లడ్డా ప్రస్థానం స్పష్టంగా చూపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు..

# సైబర్ మోసాలపై బ్యాంక్, పోలీసుల బిగ్ యాక్షన్ ప్లాన్..





సైబరాబాద్, (హంసకలం వార్త, తెలుగు దినపత్రిక 08-మే -26)

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులతో ఈరోజు సైబరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయ ఆడిటోరియంలో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో పోలీసు శాఖలు, బ్యాంకుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి దర్యాప్తు వేగవంతం చేయడం, ముఖ్యంగా మ్యూల్ ఖాతాల నియంత్రణ, ఖాతాల ఫ్రీజ్ డిఫ్రీజ్ ప్రక్రియలు, బాధితులకు నగదు తిరిగి చెల్లింపు, డిజిటల్ మోసాల విచారణ అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు అత్యంత ప్రమాదకరమైన ముప్పుగా మారాయని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ పెట్టుబడి పథకాలు, ప్రీ-లాంచ్ ఆఫర్లు, కాల్ సెంటర్ మోసాలు, క్రిప్టో కరెన్సీ మోసాల ద్వారా ప్రజలు భారీ మొత్తంలో డబ్బు కోల్పోతున్నారని పేర్కొన్నారు. చాలామంది జీవితకాల పొదుపును కోల్పోయి తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో పడుతున్నారని తెలిపారు. సైబరాబాద్ పరిధిలో 2025 సంవత్సరంలో సైబర్ మోసాల కారణంగా ప్రజలు సుమారు 438 కోట్ల రూపాయలు కోల్పోగా, 2026లో ఇప్పటివరకు 104 కోట్ల రూపాయల నష్టం జరిగినట్లు వెల్లడించారు. సోషల్ మీడియా ద్వారా అవగాహన పెరుగుతున్నప్పటికీ మరింత అప్రమత్తత, పటిష్టమైన నివారణ చర్యలు అవసరమని ఆయన స్పష్టం చేశారు. బ్యాంకింగ్ డేటా భద్రత, మ్యూల్ ఖాతాల నియంత్రణ, దర్యాప్తులకు బ్యాంకుల తక్షణ సహకారం అత్యంత కీలకమని తెలిపారు. ఫిర్యాదులపై వేగంగా స్పందించేందుకు ప్రతి బ్యాంకులో ప్రత్యేక సైబర్ విభాగాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. ప్రజలు పెట్టుబడులు పెట్టే ముందు వాస్తవాలను పరిశీలించుకోవాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నేరగాళ్లకు సహకరించవద్దని విజ్ఞప్తి చేశారు. దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలపై సైబర్ నేరాల విభాగం ఉప కమిషనర్ టి. సాయి మనోహర్ మాట్లాడుతూ బ్యాంకుల నుండి ఖాతా వివరాలు, కేవైసీ పత్రాలు, ఖాతా ఫ్రీజ్ నిర్ధారణలు ఆలస్యంగా అందడం వల్ల నిందితులను పట్టుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఒకసారి ఖాతాను ఫ్రీజ్ చేసిన తర్వాత ఎలాంటి డెబిట్ లావాదేవీలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు అవసరమని సూచించారు. సీఎస్‌బీ ఎస్పీ సాయి జాతీయ నేర గణాంకాల బ్యూరో డేటాను విశ్లేషిస్తూ ప్రతి బ్యాంకులో తాజా వివరాలతో నోడల్ అధికారులను నియమించి సైబర్ నేర స్పందన కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దీని ద్వారా కమ్యూనికేషన్ వేగవంతం కావడంతో పాటు కష్టమర్ల సొమ్ము రక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. బ్యాంకు సిబ్బందికి సైబర్ నేరాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, కార్పొరేట్ ఖాతాల సంబంధిత వివరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ డీసీపీ కోటి రెడ్డి, క్రైమ్స్ డీసీపీ ఏ. ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, సీఎస్‌బీ ఎస్పీ సాయి శ్రీతో పాటు ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ తదితర బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు..

## వేసవి శిబిరానికి విద్యార్థులకు ఆహ్వానం

-ఆదర్శ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోయిజ్ బేగ్..



వీణవంక ప్రతినిధి, మే 8(హంసకలం వార్త).

వీణవంక మండలం లోని ఆదర్శ పాఠశాల ఘన్ముక్ల లో 11 మే నుండి 25 మే వరకు వేసవి శిబిరం నిర్వహించబడునని, ప్రిన్సిపాల్ మొయిజ్ బేగ్ మాట్లాడుతూ.. మండలం లోని అన్నీ పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చునని,ఉదయం 8 నుండి 12 గంటల వరకు క్లాసెస్ జరుగునని,విద్యార్థుల పాఠశాలకి మరియు ఇంటికి రవాణా బాధ్యత తల్లిదండ్రులేవహించాలని,విద్యార్థులు తల్లిదండ్రుల సమ్మతి పత్రాన్ని తీసుకురావాలి.వేసవి శిబిరంలో పాల్గొనడానికి 100 మంది విద్యార్థులకు మాత్రమే అనుమతిఉంది.కార్యక్రమాలు:ఆటలు, సంగీతం , పాటలు, క్విజ్, భావప్రసార నైపుణ్యాలు, గణిత నైపుణ్యాలు, విజ్ఞానశాస్త్ర ప్రయోగాలు, వ్యక్తిత్వ వికాసం , అవసరాల ఆధారిత కార్యక్రమాలు మొదలైనవి.విద్యార్థులు తమ పేరు, పాఠశాల పేరు మరియు విద్యార్థి పెన్ నంబర్‌తో నమోదు చేసుకోవచ్చు. పేరు నమోదు కోసం సెల్ నెంబర్ 9908020318 లో సంప్రదించాలన్నారు.

## నిరుపేద సొంతింటి కల నెరవేరింది

--మల్లుపల్లిలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం
--ప్రజా పాలన సంక్షేమ వారోత్సవాల్లో సందడి



మెదక్ జిల్లా చిన్న శంకరంపేట హంసకలం వార్త, మే 8

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. దీనిలో భాగంగా ప్రజాపాలన సంక్షేమ వారోత్సవాల సందర్భంగా మండలంలోని మల్లుపల్లి గ్రామంలో మెట్టు బాలమణి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఎంపీడీవో దామోదర్ సర్పంచ్ ఇమ్మడి నరేష్ కలిసి శుక్రవారం ప్రారంభించారు. సొంతింటి కల నెరవేయడంతో లబ్ధిదారులు అధికారులకు మిఠాయిలు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇమ్మడి నరేష్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్-రెవెన్యూ సరిహద్దులు పారదర్శకంగా నిర్వహించాలి :

-ఆర్డీవో జయచంద్ర రెడ్డి



వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 08 హంసకలం వార్త :

వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని మంగళ్‌పర్తి, హస్తాల్పూర్ గ్రామ శివార్లలో ఉన్న సర్వే నంబర్లు 401, 283లకు సంబంధించిన ఫారెస్ట్-రెవెన్యూ సరిహద్దుల వివాదంపై చర్చించారు. సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టి నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెల్దుర్తి తాసిల్దార్ శ్రీనివాస్ ఆర్ ఐ నర్సింగ్ యాదవ్ మరియు ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు

# బిజినెస్

## ధరల పెంపుపై ప్రకటన.. బ్రిటానియా కంపెనీ షేర్ల పతనం



ఇంటర్నెట్ డెస్క్:
ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం బ్రిటానియా ఇండస్ట్రీస్ తన ఉత్పత్తుల ధరలు పెంచేందుకు నిర్ణయించింది. ఈ విషయాన్ని తాజాగా తన మదుపర్లకు తెలిపింది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ధరల పెంపు ఉంటుందని పేర్కొంది. ఈ క్రమంలో కంపెనీ షేర్లు 5 శాతం మేర పతనమయ్యాయి. ప్రస్తుతం 4.99 శాతం నష్టంతో రూ.5,524 వద్ద ట్రేడవుతోంది.ఇక 2025-26 ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చి త్రైమాసికంలో తమ నికర లాభం 21.2 శాతం మేర పెరిగి రూ.678 కోట్లకు చేరినట్టు కూడా కంపెనీ నిన్న ప్రకటించింది. యూఎస్-ఇరాన్ యుద్ధ ప్రభావం ఈ ఆర్థిక సంవత్సరంలో తమపై ఉండదని కూడా బ్రిటానియా వెల్లడించింది. ఇక ఈక్విటీ షేర్లపై కంపెనీ రూ.90.50 డివిడెండ్‌ను ప్రకటించింది. మొత్తం రూ.407.88 కోట్లను షేర్ హోల్డర్‌లకు పంపిణీ చేసినట్టు కూడా పేర్కొంది. మరో ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం డాబర్ ఇండియా కూడా తమ ఉత్పత్తుల ధరలు పెంచే విషయమై ఆలోచిస్తున్నట్టు జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. 4 శాతం మేర ధరల పెంపుపై యోచిస్తున్నట్టు సమాచారం. ముడి సరకుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో డాబర్ ఇండియా ధరల పెంపుపై యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

## దేశంలో తొలి స్పేస్ టెక్ యూనికార్న్‌గా స్కైరూట్




హైదరాబాద్ (బిజినెస్):
అంతరిక్ష రంగానికి చెందిన హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. వ్యాపార అవసరాల కోసం తాజాగా 6 కోట్ల డాలర్ల (సుమారు రూ.564 కోట్లు) నిధులు సమీకరించిందీ సంస్థ. ఈ లావాదేవీలో భాగంగా కంపెనీ విలువను 110 కోట్ల డాలర్లుగా (దాదాపు రూ.10,340 కోట్లు) లెక్కగట్టారు. తద్వారా స్కైరూట్ యూనికార్న్‌గా అవతరించింది. దేశంలోని తొలి స్పేస్ టెక్ యూనికార్న్ ఇదే. ఈ ఏడాదిలో యూనికార్న్ హోదా సాధించిన నాలుగో స్టార్టప్‌గా నిలిచింది. కనీసం 100 కోట్ల డాలర్ల (రూ.9.400కోట్లు) మార్కెట్ విలువ కలిగిన స్టార్టప్‌లను యూనికార్న్‌గా పిలుస్తారు.

**ఎవరెవరు పెట్టుబడులు పెట్టారు..?**

స్కైరూట్‌లో తాజా రౌండ్ పెట్టుబడులకు షెర్పాలో వెంచర్స్, సింగపూర్ ప్రభుత్వ వెల్త్ ఫండ్ జీఐసీ సహ నేతృత్వం వహించాయి. షెర్పాలో, జీఐసీతో పాటు స్కైరూట్‌లో ఇప్పటికే ఇన్వెస్ట్ చేసిన గ్రీన్‌కో గ్రూప్ వ్యవస్థాపకులు, ప్రపంచ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌రాక్, అర్కమ్ వెంచర్స్, ప్లేబుక్ పార్ట్‌నర్స్, సంఘ్వీ ఫ్యామిలీ ఆఫీస్ తాజా రౌండ్‌లో పెట్టుబడులు పెట్టాయి. ఈ రౌండ్‌తో కలిపి స్కైరూట్ ఇప్పటివరకు 16 కోట్ల డాలర్ల (రూ.1,500 కోట్లు) పెట్టుబడులు సమీకరించింది.

**తాజా నిధులతో ఏం చేయనుందంటే..**

కొత్తగా సమీకరించిన పెట్టుబడులను తయారీ సామర్థ్య విస్తరణ, విక్రమ్-1 లాంచింగ్‌ల ఫ్రీక్వెన్సీ పెంపు, విక్రమ్-2 అభివృద్ధి వేగవంతం కోసం వినియోగించనుంది.

**స్కైరూట్ బోర్డులోకి రామ్ శ్రీరామ్**

షెర్పాలో వెంచర్స్ వ్యవస్థాపకుడు రామ్ శ్రీరామ్ స్కైరూట్ బోర్డులో చేరబోతున్నారు. రామ్ శ్రీరామ్ ప్రముఖ టెక్ ఇన్వెస్టర్. అంతేకాదు, అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ బోర్డు సభ్యుడు కూడా.

**2018లో ప్రారంభం**

ఇస్రో మాజీ శాస్త్రవేత్తలైన పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా కలిసి 2018లో స్కైరూట్‌ను ప్రారంభించారు. విక్రమ్ పేరుతో అంతరిక్షంలో ఉపగ్రహాలను (శాటిలైట్లు) ప్రవేశపెట్టేందుకు అవసరమైన చిన్న, మధ్యస్థాయి లాంచింగ్ రాకెట్లను తయారు చేస్తోందీ సంస్థ. విక్రమ్ ఎస్ మిషన్‌లో భాగంగా 2002లో అంతరిక్షంలోకి రాకెట్‌ను లాంచ్ చేసిన తొలి ప్రైవేట్ కంపెనీ ఇదే. ప్రస్తుతం కంపెనీ విక్రమ్-1 రాకెట్‌ను లాంచ్ చేసేందుకు సిద్ధమవుతోంది.

## నిశాంక హాఫ్ సెంచరీ.. కేకేఆర్ ముందు స్వల్ప లక్ష్యం




ఇంటర్నెట్ డెస్క్:
ఐపీఎల్ 2026లో భాగంగా అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ బ్యాటర్లు పూర్తిగా తేలిపోయారు. కేకేఆర్ బౌలర్ల ధాటికి విలవిల్లాడారు. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేశారు. కేకేఆర్‌కు 143 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించారు. ఢిల్లీ ఓపెనర్ పాతుమ్ నిశాంక(50; 29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సలు) హాఫ్ సెంచరీ చేశాడు. అతడి వల్లే ఢిల్లీకి ఆ గౌరవప్రదమైన స్కోర్ లభించింది. నిశాంక మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ రాణించలేదు. ఆఖర్లో అశుతోశ్ శర్మ(39; 28 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సలు) పోరాడాడు. కేఎల్ రాహుల్(23), నితీశ్ రాణా(8), సమీర్ రిజ్వీ(3), స్టబ్స్(2), అక్షర్ పటేల్(11), స్టార్క్(0) వెనువెంటనే ఔటై పెవిలియన్ చేరారు. విప్రజ్ నిగమ్(3లి), లుంగి ఎంగిడి(1లి) నాటౌట్‌గా నిలిచారు. కేకేఆర్ బౌలర్లలో అనుకుల్ రాయ్ 2, కార్తిక్ త్యాగి 2, వైభవ్ అరోరా 1, సునీల్ నరైన్ 1, గ్రీన్ 1 వికెట్ పడగొట్టారు.

## ధోని వికెట్ తీస్తేనే సీఎస్కేలో అవకాశం వస్తుందని భావించా: అశ్విన్




ఇంటర్నెట్ డెస్క్:
టీమిండియా స్టార్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్.. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున చాలా కాలంపాటు ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే. అశ్విన్ తన కెరీర్‌లో జరిగిన ఓ ఆసక్తికర సంఘటనను తాజాగా పంచుకున్నాడు. కెరీర్ ఆరంభంలో స్టార్ ప్లేయర్ ఎంఎస్ ధోని వికెట్ తీసిన ఆనందంలో అతిగా సెలబ్రేట్ చేసుకున్నాడని, దీంతో ధోని తనపై అసహనం వ్యక్తం చేశాడని వెల్లడించాడు. జియో స్టార్ నిర్వహించిన 'ది రవిచంద్రన్ అశ్విన్ ఎక్స్‌పీరియన్స్' అనే కార్యక్రమంలో అశ్విన్ మాట్లాడాడు.'నా కెరీర్ ఆరంభంలో జట్టులో ముత్తయ్య మురళీధరన్ వంటి దిగ్గజ స్పిన్నర్లు ఉండటంతో నాకు పెద్దగా అవకాశాలు రాలేదు. 2008లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. 2009 ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్‌పై తొలి మ్యాచ్ ఆడాను. కానీ 2010 వరకు నాకు అవకాశాలు పరిమితంగానే వచ్చాయి. అయితే ఛాలెంజర్ ట్రోఫీలో భాగంగా ఎంఎస్ ధోనికి బౌలింగ్ చేసే అవకాశం వచ్చింది. నా బౌలింగ్‌లో ధోని డీప్ కవర్ షాట్ ఆడగా నేను డైవ్ చేస్తూ క్యాచ్ పట్టాను. ఆ వికెట్ తీసిన ఆనందంలో అతిగా సెలబ్రేట్ చేసుకున్నా. దీంతో ధోని చిరాకు పడ్డాడు. 'ఇంతగా సెలబ్రేట్ చేసేదేముంది?' అంటూ ప్రశ్నించాడు. 'మీ వికెట్ తీసుకోవడం నా కల.. ఇదే నాకు సీఎస్కేలో అవకాశం తెచ్చిపెడుతుందని నా నమ్మకం' అని చెప్పా. ఆ తర్వాతి ఏడాదే నాకు చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో అవకాశం వచ్చింది' అని అశ్విన్ వెల్లడించాడు.

**అదే నా కోరిక..**

'సీఎస్కేలో మంచి బ్యాటర్లు మాత్రమే కాదు.. నాణ్యమైన బౌలర్లు కూడా ఉండేవారు. మురళీ విజయ్, బద్రీనాథ్, షాదాబ్ వంటి దేశీయ ప్లేయర్లు కీలక పాత్ర పోషించేవారు. ప్లేయర్లకు పూర్తి స్వేచ్ఛ, కుటుంబ సభ్యులకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండేవి. టికెట్లు, ప్రయాణం, హోటల్ గదులు.. అన్నీ ఫ్రాంచైజీనే చూసుకునేది. ఆటగాళ్లు కేవలం క్రికెట్‌పైనే దృష్టి పెట్టేలా వాతావరణం ఉండేది. నా ఐపీఎల్ ప్రయాణం సీఎస్కేతోనే ముగియడం నాకు ఎంతో ప్రత్యేకంగా అనిపించింది. ఎక్కడ మొదలైందో అక్కడే ముగిసింది. చెపాక్‌లో చివరి మ్యాచ్ ఆడాలనేది నా కోరిక. అది కూడా నెరవేరి ఉంటే మరింత ఆనందంగా ఉండేది' అని అశ్విన్ వివరించాడు.

# స్పోర్ట్స్

## టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్!




టీమిండియా టీ20 కెప్టెన్సీలో మార్పులు జరగనున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్సీ బాధ్యతలు సూర్యకుమార్ యాదవ్ నుంచి శ్రేయస్ అయ్యర్‌కు బదిలీకానున్నట్లు సమాచారం. ఐపీఎల్ 2026 తర్వాత అయ్యర్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడని టాక్ వినిపిస్తోంది. ఈ మేరకు బీసీసీఐ శ్రేయస్ అయ్యర్‌కు మెసేజ్ కూడా పంపినట్లు తెలుస్తోంది.

సూర్యకుమార్ నేతృత్వంలో టీమిండియా టీ20 వరల్డ్ కప్ 2026ను గెలిచినప్పటికీ, ఇటీవల పేలవ ఫామ్‌తో తంటాలు పడుతున్న అతడిని సారథిగా తప్పించాలని సెలక్షన్ కమిటీ భావిస్తున్నట్లు సమాచారం. 'స్కై' ఫామ్‌లోకి వస్తాడని కొంతకాలంగా వేచిచూస్తున్నప్పటికీ అతడి ఆటతీరులో మార్పు రాకపోవడంపై ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా, బ్యాటర్‌గా శ్రేయస్ అయ్యర్ రాణిస్తున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 9 ఇన్నింగ్స్‌లో 333 పరుగులు సాధించి 47.57 సగటు, 164.04 స్ట్రైక్ రేట్ నమోదు చేశాడు. దీంతో అయ్యర్‌ను తిరిగి టీ20 జట్టులోకి తీసుకుని కెప్టెన్సీ పగ్గాలు అప్పగిస్తారని బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి. ఐపీఎల్ ముగిసిన తర్వాత సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. అప్పుడే శ్రేయస్ కెప్టెన్సీపై ప్రకటన వచ్చే ఛాన్స్ ఉందని క్రీడా వర్గాలు చెబుతున్నాయి. అంతేకాకుండా వన్డేలు, టీ20లు రెండింటికీ ఒకే కెప్టెన్ ఉండాలని బోర్డు ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. శ్రేయస్‌కు గతంలో భారత టెస్ట్, వన్‌డే జట్లకు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం కూడా ఉంది. మ్యాచ్ సమయంలో అతడు సహనంగా, ప్రశాంతంగా ఉండే విధానం, పరిణితితో కూడిన నిర్ణయాలు భారత టీ20 జట్టుకు కావాల్సిన లక్షణాలుగా పరిగణించబడుతున్నాయని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు

# రణవీర్ సింగ్ 'ధురంధర్ 2' ఓటీటీ రిలీజ్ తేదీ ఖరారు

-ధురంధర్-2 ఓటీటీలోకి వస్తోంది.. అయితే భారత్ లో కాదు!
-మే 14 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో అంతర్జాతీయ స్ట్రీమింగ్
-భారత్‌లో జియోహాట్‌స్టార్‌లో విడుదల కావొచ్చని ప్రచారం
-ప్రపంచవ్యాప్తంగా రూ.1,790 కోట్లకుపైగా వసూళ్లు సాధించిన చిత్రం
-దాదాపు 4 గంటల నిడివితో 'రా అండ్ అన్ దేఖా' వర్షన్‌గా విడుదల




బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2: ది రివెంజ్' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. థియేటర్లలో రికార్డు స్థాయి వసూళ్లు సాధించిన ఈ చిత్రం, మే 14 నుంచి అంతర్జాతీయంగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. అయితే, భారత్‌లో మాత్రం ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉండదు. దీంతో భారత ప్రేక్షకులు ఎక్కడ చూడాలనే దానిపై ఆసక్తి నెలకొంది. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 19న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. తాజాగా నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమా 'రా అండ్ అన్ దేఖా' అనే ట్యాగ్‌లైన్‌తో, దాదాపు 3 గంటల 52 నిమిషాల సుదీర్ఘ రన్‌టైమ్‌తో రానుంది. సెన్సార్ చేయని సన్నివేశాలు, అదనపు ఫుటేజ్‌తో ఈ ప్రత్యేక వర్షన్‌ను విడుదల చేయనున్నారు. భారత్‌లో ఈ చిత్రాన్ని జియోహాట్‌స్టార్ ప్లాట్‌ఫామ్‌పై మే 14నే విడుదల చేయవచ్చని కొన్ని కథనాలు సూచిస్తున్నాయి. అయితే, దీనిపై నిర్మాతల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సినిమాలోని ఒక పాట రీమిక్స్‌పై కోర్టులో కేసు నడుస్తున్న నేపథ్యంలో, థియేట్రికల్ రిలీజ్ తర్వాత 8 వారాల గ్యాప్ ఇచ్చాకే ఓటీటీలోకి వస్తుందని నిర్మాతలు గతంలో తెలిపారు. మే 14 నాటికి సినిమా విడుదలై సరిగ్గా 8 వారాలు పూర్తవుతుంది. ఈ చిత్రంలో రణవీర్ సింగ్‌తో పాటు సారా అర్జున్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, సంజయ్ దత్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటివరకు ఈ సినిమా భారత్‌లో రూ. 1,140 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించగా, ప్రపంచవ్యాప్తంగా రూ. 1,791 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది. అంతర్జాతీయంగా విడుదల తేదీ ఖరారైనప్పటికీ, భారత్‌లోని ఓటీటీ రిలీజ్‌పై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# దక్షిణాది స్టార్లతో పనిచేయడం తన తండ్రికి గర్వకారణమని వెల్లడి





-హిందీలో అవకాశాలు లేనివారే సౌత్ వైపు వెళతారనే అభిప్రాయం అప్పట్లో ఉండేది: సమీరారెడ్డి
-తనను దక్షిణాది సినిమాల్లోకి వెళ్లొద్దని హెచ్చరించారన్న సమీరారెడ్డి
-ఇప్పుడు బాలీవుడ్ అగ్రతారలు సౌత్ సినిమాల కోసం పోటీ పడుతున్నారని వ్యాఖ్య

దక్షిణాది సినిమాలపై తనకున్న గౌరవాన్ని సినీ నటి సమీరారెడ్డి మరోసారి చాటుకున్నారు. తన కెరీర్ ఆరంభంలో నాటి అనుభవాల గురించి ఓ ఇంటర్వ్యూలో ఆమె పంచుకున్నారు. సమీరారెడ్డి కెరీర్ మొదట్లో హిందీ సినిమాలతో బిజీగా ఉన్నప్పుడు, ఆమె టీమ్ సభ్యులు దక్షిణాది సినిమాల వైపు వెళ్లొద్దని హెచ్చరించారట. "హిందీలో అవకాశాలు లేని వారే సౌత్ వైపు వెళతారు" అనే తప్పుడు అభిప్రాయం అప్పట్లో ఉండేదని ఆమె గుర్తు చేసుకున్నారు.
కానీ, ఒక సౌత్ ఇండియన్ అమ్మాయిగా తన మూలాలను గౌరవిస్తూ, ఆ మాటలను పక్కన పెట్టి జూనియర్ ఎన్టీఆర్ వంటి స్టార్ల సరసన నటించడానికి ఆమె సిద్ధపడ్డారు. చిరంజీవి, ఎన్టీఆర్, సూర్య, అజిత్ వంటి దిగ్గజాలతో పనిచేయడం తన కుటుంబానికి, ముఖ్యంగా తన తండ్రికి గర్వకారణమని ఆమె సగర్వంగా చెప్పుకొచ్చారు.
ప్రస్తుతం బాలీవుడ్ అగ్ర హీరోయిన్లు సౌత్ సినిమాల కోసం పోటీ పడుతున్న విషయాన్ని సమీరా గుర్తు చేశారు. దక్షిణాది దర్శకులు కొత్త ప్రయోగాలు చేయడానికి, రిస్క్ తీసుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని, అందుకే ఇక్కడి సినిమాలు సాంకేతికంగా, యాక్షన్ పరంగా ఎప్పుడూ ముందంజలో ఉంటాయని ఆమె విశ్లేషించారు. హిందీ మేకర్స్ తరచుగా 'సేఫ్ జోన్'లో ఉండాలని చూస్తారని ఆమె అభిప్రాయపడ్డారు.
దాదాపు దశాబ్ద కాలం పాటు వెండితెరకు దూరంగా ఉన్న సమీరా, ఇప్పుడు సంజయ్ దత్ సరసన 'ఆఖరి సవాల్' చిత్రంతో మళ్లీ ప్రేక్షకులను పలకరించబోతున్నారు. ఇది తన కమ్ బ్యాక్ కాదని, కేవలం ఒక చిన్న విరామం తర్వాత చేస్తున్న ప్రయాణమని ఆమె స్పష్టం చేశారు.

# ఎన్నారై మోసం కేసు..

## నటి అషురెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ


-తనపై నమోదైన కేసులో దర్యాప్తు నిలిపివేయాలని కోరిన అషురెడ్డి
-దర్యాప్తు నిలిపివేతకు, కఠిన చర్యల నుంచి మినహాయింపునకు నిరాకరణ
-పెళ్లి పేరుతో రూ.10.5 కోట్లు వసూలు చేశారంటూ ఆరోపణలు
-కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణ జూన్ 9కి వాయిదా



పెళ్లి పేరుతో ఎన్నారై వ్యాపారవేత్తను మోసం చేశారన్న ఆరోపణలపై నమోదైన క్రిమినల్ కేసులో సినీ నటి అషురెడ్డికి (వెంకట అశ్వినిరెడ్డి) తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపైనా, తన తల్లి యశోదరెడ్డిపైనా నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని, దర్యాప్తును నిలిపివేయాలని ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. కఠిన చర్యలు తీసుకోకుండా మినహాయింపు ఇవ్వాలన్న అభ్యర్థనను కూడా తోసిపుచ్చింది. ఈ కేసుపై గురువారం జస్టిస్ జె.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. పోలీసులు తప్పుడు ఆరోపణలతో కేసు నమోదు చేశారని, దర్యాప్తును నిలిపివేయాలని అషురెడ్డి తరఫు న్యాయవాది కోరారు. అయితే, ప్రభుత్వ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కేసు నమోదుకు తగిన ఆధారాలున్నాయని తెలిపారు. సుమారు రూ.10.5 కోట్ల నగదు బదిలీ ఆన్‌లైన్‌లోనే జరిగిందని, దర్యాప్తు కొనసాగించాల్సి ఉందని కోర్టుకు వివరించారు. ఇప్పటికే పిటిషనర్‌కు 41ఏ నోటీసులు జారీ చేశామని కూడా పేర్కొన్నారు. లండన్‌లో ఉంటున్న తన కుమారుడు వై.వి.ధర్మేంద్రను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అషురెడ్డి, ఆమె తల్లి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసి మోసం చేశారంటూ హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త వై. సత్యనారాయణమూర్తి హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, దర్యాప్తును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించారు. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను జూన్ 9వ తేదీకి వాయిదా వేశారు.

## తన మరణంపై వస్తున్న వదంతులను ఖండించిన శక్తి కపూర్

-నేను చనిపోలేదు.. ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నా: శక్తి కపూర్
-ఆరోగ్యంగా ఉన్నానంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల
-తప్పుడు ప్రచారం చేసేవారిపై సైబర్ ఫిర్యాదు చేస్తానని హెచ్చరిక
-గతంలో తన తండ్రి సినీ ప్రస్థానం గురించి వివరించిన శ్రద్ధా కపూర్
-ఎలాంటి నేపథ్యం లేకుండా తండ్రి పరిశ్రమలో నిలదొక్కుకున్నారని ప్రశంస



ప్రముఖ బాలీవుడ్ నటుడు శక్తి కపూర్ (73) తన మరణంపై సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న వదంతులను తీవ్రంగా ఖండించారు. తాను ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నానని స్పష్టం చేస్తూ ఇన్?స్టాగ్రామ్?లో ఒక వీడియోను విడుదల చేశారు. ఈ తప్పుడు ప్రచారంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.
"అందరికీ నమస్కారం. నా మరణం గురించి వస్తున్న వార్తలన్నీ అబద్ధం. నేను ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్నాను. దయచేసి ఆ వార్తలను పట్టించుకోవద్దు" అని శక్తి కపూర్ తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఈ విషయంపై తాను సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయబోతున్నానని, ఇలాంటివి చేయడం మంచిది కాదని ఆయన హితవు పలికారు. ఈ వీడియో చూసిన ఆయన అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కామెంట్లు పెట్టారు.కాగా, నాలుగు దశాబ్దాల సినీ కెరీర్‌లో శక్తి కపూర్ ప్రతినాయకుడిగా, హాస్యనటుడిగా సుమారు 700 చిత్రాలలో నటించి తనదైన ముద్ర వేశారు. 'రాజా బాబు', 'అందాజ్ అప్నా అప్నా', 'హంగామా', 'మాలామాల్ వీక్లీ' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలు ఆయన ఖాతాలో ఉన్నాయి

# 'గోదారి గట్టుపైన' - మూవీ రివ్యూ!

సుమంత్ ప్రభాస్ హీరోగా చేసిన సినిమానే 'గోదారి గట్టుపైన'. గతంలో 'మేం ఫేమస్' అంటూ వచ్చిన సుమంత్ ప్రభాస్, హీరోగా మంచి మార్కులు కొట్టేశాడు. ఆ తరువాత కొంత గ్యాప్ తీసుకుని ఆయన చేసిన సినిమానే ఇది. తెలంగాణ నేపథ్యంతో కూడిన కథతో మొదటి సినిమా చేసిన తను, అందుకు పూర్తి భిన్నంగా గోదావరి యాస నేపథ్యంలో ఈ సినిమాను చేశాడు. ఈ సినిమాతో కోలీవుడ్ బ్యూటీ 'నిధి ప్రదీప్' తెలుగు తెరకి పరిచయమైంది. ఈ రోజునే థియేటర్లకు వచ్చిన ఈ సినిమా ఎలా ఉందనేది చూద్దాం.
అది 'తణుకు' సమీపంలోని 'మంచిలి' అనే విలేజ్. అక్కడ రాజు ( సుమంత్ ప్రభాస్) ఆటో నడుపుతూ తన కుటుంబంతో కలిసి నివసిస్తూ ఉంటాడు. తల్లి .. తండ్రి .. చెల్లెలు సమైక్య .. ఇదీ అతని కుటుంబం. ఇక తన స్నేహితులైన రహీమ్ (సుదర్శన్) .. రాబర్ట్( రాజ్ కుమార్ కసిరెడ్డి)తో తన ఎమోషన్స్ ను ఎక్కువగా షేర్ చేసుకుంటూ ఉంటాడు. రాజు చెల్లెలు 'సమైక్య' స్నేహితురాలే మాయ ( నిధి ప్రదీప్). ఆమె ఓ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న శ్యామ్ బాబు (జగపతిబాబు) కూతురు.
శ్యామ్ బాబుకి తన కూతురు 'మాయ' అంటే ప్రాణం. డబ్బుకి ఇబ్బంది లేని కుటుంబానికి తన కూతురును కోడలిగా పంపించాలనేది ఆయన ఆలోచన. అయితే సమైక్య ద్వారా మాయకి రాజుతో పరిచయవుతుంది. తాను ఇంజనీరింగ్ చదువుతున్నప్పటికీ, పెద్దగా చదువు అబ్బని రాజు పట్ల అభిమానం పెంచుకుంటుంది. అది కాస్త ప్రేమగా మారుతుంది. అప్పటి నుంచి మాయ ధోరణిలో మార్పు రావడాన్ని శ్యామ్ బాబు గమనిస్తాడు. అందుకు కారణం ఏమిటనేది ఒక కంట గమనిస్తూ ఉండమని, తన భార్య ఝాన్సీ ( లైలా)ను హెచ్చరిస్తాడు.
ఒక రోజున శ్యామ్ బాబు తన కూతురుకి ఒక సంబంధం తీసుకొస్తాడు. తన కూతురు భవిష్యత్తు అన్ని విధాలుగా బాగుంటుందని అతను నమ్మిన సంబంధం అది. తాను ఆటో డ్రైవర్ రాజును లవ్ చేస్తున్నట్టుగా అప్పుడే తండ్రితో చెబుతుంది మాయ. అప్పుడు శ్యామ్ బాబు ఏం చేస్తాడు? ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు? రాజు - మాయ పెళ్లి జరుగుతుందా? తన కూతురుకు గొప్ప సంబంధం చేయాలనే శ్యామ్ బాబు కోరిక నెరవేరుతుందా? అనేది మిగతా కథ.
ఒక మధ్య తరగతి తండ్రికి తన కూతురు విషయంలో అనేక భయాలు ఉంటాయి. ఆమె పెళ్లికి దగ్గర పడుతున్నా కొద్దీ అతనిలో భయంతో పాటు బాధ్యత కూడా పెరుగుతూ పోతుంది. తన కూతురికి ఎలాంటి ఇబ్బందులు లేని సంబంధం చేయాలని ఆ తండ్రి కోరుకుంటాడు. ఆ తండ్రి ఆశలకు పూర్తి విరుద్ధమైన వ్యక్తిని ప్రేమిస్తున్నట్టు ఆ కూతురు చెబితే ఎలా ఉంటుందనే ఒక ఆసక్తికరమైన అంశంతో ఈ కథ వేగాన్ని పుంజుకుంటుంది.
హీరో - హీరోయిన్ పరిచయం .. సాన్నిహిత్యం .. ప్రేమ .. అలకలతో ఫస్టాఫ్ సాగుతూ వెళుతుంది. వాళ్ల మధ్య ప్రేమ బలపడుతూ ఉన్న సమయంలోనే, చదువుతో పాటు కులమతాలు అడ్డుగోడలుగా మారడం మొదలవుతుంది. ఈ అడ్డుగోడలను ఈ






ప్రేమ జంట ఎలా దాట గలిగిందనేది సెకండాఫ్ పై కుతూహలాన్ని పెంచుతుంది.సెకండాఫ్ అంతా ఈ ప్రేమ పక్షులు ఎదుర్కునే పరీక్షలతోనే కొనసాగుతుంది.
'గోదారి గట్టుపైన' .. ఇది ఒక రాజు గాడి ప్రేమకథ. లేదంటే ఒక ఆటోవాలా ప్రేమకథగా చెప్పుకోవచ్చు. చదువుకున్న అమ్మాయికీ .. చదువు అబ్బని ఆటోడ్రైవర్ కి మధ్య నడిచే ప్రేమకథ ఇది. ప్రేమకి కులమతాలు లేవు .. ప్రేమికులకు అవి అడ్డుగోడలు కాదు. అభ్యంతరాలు ఉన్నవాళ్లు ఆ తరువాత అర్థం చేసుకుని సర్దుకుపోవలసిందే అని నిరూపించే కథ ఇది. ఆల్రెడీ ఇలాంటి కథలు గతంలో చాలానే వచ్చాయి గదా? అనే ప్రశ్న తప్పకుండా ఎదురవుతుంది. కాస్త అటు ఇటుగా అలాంటి ప్రయత్నమే మళ్లీ జరిగితే తప్పేం లేదు కదా! అనే సమాధానంతో సరిపెట్టుకోవలసిందే .
రొటీన్ గా సాగే ఈ ప్రేమకథలో జగపతి బాబు - లైలా పాత్రలు కాస్త బలంగానే కనిపిస్తాయి. కానీ ఆ పాత్రలను పవర్ఫుల్ గా ఆవిష్కరించలేకపోయారు. కథలో కీలకమైన మలుపు జగపతిబాబు దగ్గరికి వచ్చి ఆగేసరికి, మిగిలి ఉన్న సమయం చాలా తక్కువ. ఆ సమయంలో కూడా ఆ పాత్రను ఆయనకి గల క్రేజ్ కి తగినట్టుగా పరిగెత్తించలేదు. అసలు కూతురు లవ్ మేటర్ శ్యామ్ బాబుకి ఎప్పుడు తెలుస్తుందా అనే ఉత్కంఠతోనే ఆడియన్స్ వెయిట్ చేస్తూ కూర్చుంటారు. ఇంటర్వెల్ తరువాత చాలా సేపటికి గానీ, వాళ్ల కల ఫలించదు. కథ రొటీన్ గా ఉండటంతో, విషయం లేకపోయినా సుదర్శన్ కామెడీనే బెటర్ గా భావించి ప్రేక్షకుడు పరిగెడుతూ ఉంటాడు.
ఇక ప్రీ క్లైమాక్స్ లో సుమంత్ ప్రభాస్ .. జగపతి బాబు .. లైలా .. రాజీవ్ కనకాలకి రాసిన డైలాగ్స్ సింపుల్ గా అనిపిస్తూనే ఎమోషనల్ గా కనెక్ట్ అవుతాయి. క్లైమాక్స్ అందరూ ఊహించినట్టుగానే ఉంటుంది. సుమంత్ ప్రభాస్ నటన బాగుంది. కాకపోతే గోదావరి యాసలో డైలాగ్స్ చెప్పడానికి బాగానే ఇబ్బంది పడినట్టుగా అనిపిస్తుంది. నిధి ప్రదీప్ నటన కూడా ఆకట్టుకుంటుంది. ఆమె కళ్లు ప్రధానమైన ఆకర్షణగా నిలుస్తాయి.
జగపతిబాబు యాక్టింగ్ చాలా సహజంగా అనిపిస్తుంది. కాకపోతే ఆ పాత్రకి ఇంకాస్త పవర్ అవసరమని అనిపిస్తుంది. సుదర్శన్ కామెడీ ఆరంభంలో కాస్త అతిగా అనిపించినా, ఆ తరువాత ఆడియన్స్ అలవాటు పడిపోతారు. విలేజ్ నేపథ్యంలో లొకేషన్స్ మనకి బోర్ అనిపించకుండా చూసుకుంటాయి. సాయి సంతోష్ ఫొటోగ్రఫీ .. నాగవంశీ కృష్ణ సంగీతం ఫరవాలేదు.
రొటీన్ గా నడిచే ప్రేమకథ ఇది. కాలవగట్లు .. కలువపూలు .. మిణుగురులు వంటి సన్నివేశాలు కూడా రొటీన్ గానే అనిపిస్తాయి. కామెడీ సన్నివేశాలు కూడా అదే దార్లో పరిగెత్తుతాయి. చివర్లో కొన్ని డైలాగ్స్ మాత్రం ఎమోషనల్ గా కనెక్ట్ అవుతాయి. అంతకు మించి 'గోదారి గట్టుపైన' మనకి కొత్తగా కనిపించేదేమీ లేదు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449